క్లుప్తంగా

బీసీలకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

త్రిపురాంతకం: రాష్ట్ర ప్రభుత్వం బీసీల జపం చేస్తూనే వారికి ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.శ్రీనివాస్ విమర్శించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన బీసీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పరంగా బీసీలకు వచ్చిన హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. బీసీలు రాష్ట్రంలో తమకు రావాల్సిన న్యాయమైన హక్కుల సాధనకు పోరాటం చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. రాష్ట్రంలో 145 బీసీ కులాలు ఉన్నాయని, వారికి రావాల్సిన రిజర్వేషన్ అందించాలన్నారు. బీసీ కులగణన నిర్వహించి దాని ప్రకారం రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కేటాయించాలన్నారు. కులాలకు అనుగుణంగా అసెంబ్లీలో బిల్లులు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. రాజకీయ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని బీసీ సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. బీసీ నాయకులు బి.రామయ్య, కోటయ్య, వెంకట్రావు, ఆంజనేయులు పాల్గొన్నారు. విజయవాడలో ఈ నెల 14న బీసీల సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభను జయప్రదం చేయాలని బీసీ నాయకులు పిలుపు నిచ్చారు.

సోలార్ ఫెన్సింగ్‌తో పంటకు రక్ష

- వినూత్న పద్ధతిలో పొలాల్లో అమరిక
- ప్రభుత్వం సహకరించాలని రైతుల అభ్యర్థన
- ప్రాణహాని లేకుండా చర్యలు తీసుకోవాలని వినతి

పుల్లలచెరువు: ప్రస్తుత తరుణంలో రైతులు సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు చేయని ప్రయత్నం లేదు. రైతులకు పంటలను సాగు చేయడం ఒక ఎత్తయితే వాటిని కాపాడుకోవడం మరో ఎత్తు. విత్తనాలు నాటడం దగ్గర నుంచి కోత కోసే వరకు ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగాలి. ఇటీవల పొలాలపై జంతువుల బెడద పెరిగింది. మండలంలోని పలు గ్రామాల పరిధిలో అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న పొలాల్లో సాగు చేసే మొక్కజొన్న, బొప్పాయి, అరటి తదితర ఉద్యాన పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. రైతులు సాగు చేసిన పంటలను పందులు, జింకలు, కోతులు పాడు చేస్తున్నాయి. వాటి బారి నుంచి వేసిన పంటలను కాపాడుకునేందుకు రాత్రింబవళ్లు కాపలా ఉంటూ రైతులు శ్రమిస్తున్నారు. పొలాల చుట్టూ ఇనుప కంచె, మైక్‌సెట్లు ఏర్పాటు చేయడం, చీరలు కట్టడం, తప్పెట్లు, డబ్బాలు కొట్టడం ఇలా అనేక పద్ధతులు అనుసరిస్తున్నారు. వాటి నుంచి వెలువడే శబ్దాలకు అలవాటు పడిన జంతువులు లెక్క చేయకుండా మూకుమ్మడిగా వచ్చి పంటలను నాశనం చేస్తుండటంతో రైతుల కష్టం వృథా అవుతోంది. మండలంలోని కొన్ని గ్రామాల్లోని రైతులు వినూత్నంగా ఆలోచన చేసి


అరటి మొక్కలకు సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసిన రైతు

ప్రాణహాని లేని సోలార్ ఫెన్సింగ్ వైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు. దాన్ని ఏర్పాటు చేయడం ద్వారా పంటకు రక్షణగా ఉందని రైతులు చెబుతున్నారు.

సోలార్ కంచెతో వణ్యప్రాణులు సేఫ్

పొలంలో ఒక స్తంభానికి 12 ఓల్టులు, 15 ఓల్టులు ఉత్పత్తి సామర్థ్యమున్న సోలార్ ప్యానెల్, బ్యాటరీ, ఆరింతగ్ ఏర్పాటు చేసుకుంటారు. పొలం చుట్టూ మూడు వరసలుగా తీగలు చుట్టాలి. ఇన్సులేటర్ ఉపయోగిస్తే భూమికి విద్యుత్ సరఫరా కాదు. సౌర పలక ద్వారా వచ్చే విద్యుత్ బ్యాటరీలో నిల్వ ఉండటంతో రాత్రి వేళల్లోనూ పని చేస్తుంది. జంతువులు తీగకు తగిలినప్పుడు షాక్ కొడుతుంది. విద్యుత్ నిరంతరం సరఫరా కాకుండా సెకను, సెకనుకు మధ్య ఆన్ ఆండ్ ఆఫ్ అవుతుండడంతో ప్రాణహాని ఉండదు. సెకనుకు పల్స్ విద్యుత్ మాత్రమే ఉత్పత్తి అవుతుంది. పొలం చుట్టూ తీగలు ఏర్పాటు చేసే క్రమంలో 10 అడుగులకు ఒక కర్ర, సిమెంట్ స్తంభాలను నాటి వాటికి తీగెలు ఒక దానికి ఒకటి తగలకుండా టైట్‌గా ఏర్పాటు చేసుకోవాలి. పొలం వద్ద డేంజర్ అని బోర్డు ఏర్పాటు చేసుకోవాలి. సోలార్ బ్యాటరీ, ప్యానెల్ సామర్థ్యం ఆధారంగా రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు అవుతుంది. సుమారు ఐదు ఎకరాల వరకు పొలం చుట్టూ సోలార్ కంచె ఏర్పాటు చేసుకోవచ్చు.

రైతుల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవాలి:



రైతుల సమస్యలను పట్టించుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. రైతులు సాగు చేసిన ఏ పంటకూ గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులు సాగు చేసిన పంటను కాపాడుకునేందుకు ఏర్పాటు చేసుకునే సోలార్ ఫెన్సింగ్‌కు ఆర్థిక సహాయం లేదా పరికరాలను అందజేస్తే కొంత మేలు జరుగుతుంది. రైతులు నష్టపోతున్న విధానాలపై ప్రభుత్వం ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

– కె.వెంకటేశ్వర్లు, రైతు, పుల్లలచెరువు

నాటిన ప్రతి మొక్కనూ బతికించాలి

- కక్షిదారులకు లోక్ అదాలత్ గొప్పవరం
- సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శివశంకర్‌రెడ్డి

దర్శి: నాటిన ప్రతి మొక్కనూ బతికించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శివశంకర్‌రెడ్డి సూచించారు. స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో నేషనల్ లోక్ అదాలత్ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. కోర్టు ఆవరణలో సుమారు 70కి పైగా మొక్కలు శివశంకర్‌రెడ్డి, అద్దంకి ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, దర్శి ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి శ్రీసీతల చేతుల మీదుగా మొక్కలు నాటారు. అనంతరం లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నాటిన మొక్కను బాధ్యతగా తీసుకుని పెంచి పెద్ద పెద్ద వృక్షాలుగా చేయాలని సూచించారు. మంచి మనస్సుతో మొక్కలు నాటేందుకు కృషి చేసిన ప్రేమ్‌కుమార్, బార్ సభ్యులను అభినందించారు. అనంతరం లోక్ అదాలత్‌లో శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ లోక్‌అదాలత్ కక్షిదారులకు గొప్ప వరమని చెప్పారు. పంతాలకు వెళ్లి కోర్టుల చుట్టూ తిరగకుండా రాజీ చేసుకుంటే ఆ కేసుల్లో పైకోర్టుకు కూడా వెళ్లే అవకాశం లేదన్నారు. కోర్టుల చుట్టూ తిరిగి సమయం, డబ్బు రెండూ పోగొట్టుకుని చివరకు ఎవరో ఒకరు మాత్రమే గెలుస్తారన్నారు. ఆ తర్వాత వారి


మొక్కలు నాటుతున్న న్యాయమూర్తులు శివశంకర్‌రెడ్డి, శ్రీసీత

మధ్య కక్షలు అలాగే ఉంటాయని చెప్పారు. మంచి మనస్సుతో ఆలోచించి సమన్వయంగా ఇరువురు రాజీ చేసుకుంటే ఇద్దరూ గెలిచినట్లేనని స్పష్టం చేశారు. అనంతరం శనివారం జరిగిన నేషనల్ లోక్ అదాలత్‌లో 294 కేసులు రాజీ చేశారు. న్యాయవాదులు, ఏజీపీ రవీంద్ర, రంగ, శ్రీనివాసశాస్త్రి, శివశర్మ, గడ్డి శ్రీనివాసులు, ఎస్.సుబ్బారెడ్డి, మనోహరమ్మ, మానం రామాంజనేయులు పాల్గొన్నారు.

పాలన వదిలి గారడీ చేస్తున్న కూటమి ప్రభుత్వం

కురిచేడు: పాలన వదిలి గారడీ మాటలతో కూటమి సర్కార్ నెట్టుకొస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ యన్నాబత్తుల వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండలంలోని పడమర గంగవరం, రెడ్డన్నపల్లె గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ సుబ్బయ్య మాట్లాడుతూ మాయ మాటలు చెప్పి గద్దెనెక్కి హామీల అమలులో పూర్తిగా విఫలమయ్యారని, నిరుద్యోగులకు ఇంతవరకు నిరుద్యోగ భృతి చెల్లించలేదని, రైతుకు


పడమర గంగవరంలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భరోసా ఇవ్వలేదని, పండిన పంటలకు గిట్టుబాటు ధర లేదని, సాగు చేద్దామంటే యూరియా కూడా సరిగా లభించని పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. మహిళలకు ఇస్తామన్న పథకాలను ఇంతవరకు అమలు చేయకుండా ఫ్రీ బస్‌తో సరిపెట్టిందని విమర్శించారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం నుంచి అందిన పథకాల గురించి తెలుసుకున్నారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించారు. జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గోగుల మూడి లింగారెడ్డి, సర్పంచ్ కాసు భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వరికూటి వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ అన్నెం అరుణ, మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఊట్ల వెంకటేశ్వర్లు, తేలుకుట్ల శ్రీనివాసులురెడ్డి, అన్నెం సుబ్బారెడ్డి, మాదిరెడ్డి రామకృష్ణారెడ్డి, తుపాకుల యోగిరెడ్డి, అన్నెం అమర్‌నాథ్‌రెడ్డి, పందుగుల చెంచిరెడ్డి, కాసు కృష్ణారెడ్డి, ధనిరెడ్డి వెంకటరెడ్డి, కసిబిసి గురుమూర్తి, తుపాకుల వీరారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు .

కళా ఉత్సవ్‌లో దర్శి విద్యార్థుల ప్రతిభ


గిరిజన నృత్యం చేస్తున్న విద్యార్థినులు


విద్యార్థులతో ఉపాధ్యాయులు

దర్శి: జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో దర్శి కిజిజి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. 2025–26 ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి పోటీలు మైనంపాడులో జరిగాయి. గిరిజన నృత్యం, బుర్రకథ, మట్టిబొమ్మలు, జాన పదగానం పోటీల్లో కిజిజి విద్యార్థులు పాల్గొన్నారు. గిరిజన నృత్యం పోటీల్లో పాల్గొన్న వర్షిణి బృందం కె.శరణ్య, ఏ.అవినయ, ఎం.చైత్ర ద్వితీయ స్థానంలో బహుమతి గెల్చుకున్నారు. జానపద గానంలో జస్మిత బృందం కె.నాగమల్లేశ్వరి, వై.నిషిత పాల్గొని మూడో బహుమతి గెలుపొందారు. బుర్రకథ ప్రదర్శించిన ఆర్. హర్షిణి, జె. త్రివేణి రెండో బహుమతి పొందారు. మట్టితో బొమ్మలు తయారీలో వై.అంజలి రెండో బహుమతి పొందారు. బహుమతులు పొందిన విద్యార్థులను కిజిజి పాఠశాల డైరెక్టర్ కె.రమణారెడ్డి, ప్రధానోపాధ్యాయులైన అంథోనీలు అభినందించారు.

సూపర్ సిక్స్..అట్టర్ ఫ్లాప్!

దర్శి: సూపర్ సిక్స్, సూపర్ సెవెన్..అంటూ అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి అవి అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసగించడమే సీఎం చంద్రబాబు నైజమని వైఎస్సార్ సీపీ దర్శి, ముండ్లమూరు మండలాల కన్వీనర్లు వెన్నపూస వెంకటరెడ్డి, చింతా శ్రీనివాస రెడ్డి, ముండ్లమూరు ఎంపీపీ సుంకరసునీతా బ్రహ్మానందరెడ్డి అన్నారు. దర్శి మండలం వెంకటాచలంపల్లి, ముండ్లమూరు మండలం నూజిళ్లపల్లి, కంభంపాడు గ్రామాల్లో శనివారం బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న తీరును క్యూఆర్ కోడ్‌ల ద్వారా వివరించారు. వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుంకర సునీతా బ్రహ్మానందరెడ్డిలు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు 143 హామీలు ఇచ్చి అందులో


దర్శి మండలం వెంకటాచలంపల్లిలో క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రధానంగా సూపర్ సిక్స్ అంటూ ప్రచారం చేసి అధికారంలోకి వచ్చి సంవత్సరంన్నర అవుతున్నా ఇప్పటికీ ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామంలో చూసినా నాలుగైదుకుపైగా బెల్టు షాపులు ఉన్నాయని, గ్రామాల్లో విచ్చలవిడిగా నాసిరకం మద్యం సరఫరా చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. సంపద సృష్టికర్తనని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు అప్పులు సృష్టికర్తగా మారి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చాడని ధ్వజమెత్తారు. రాష్ట్రాభివృద్ధి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యం అవుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర మున్సిపల్ వింగ్ ప్రధాన కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ రెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్ అమీన్‌బాషా, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి లక్ష్మీరెడ్డి, ఐదో వార్డు కౌన్సిలర్ తుళ్లూరి బాబూరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు మోహన్‌బాబు, బీసీ సెల్ అధ్యక్షుడు అంకాల శ్రీను, బూత్ కమిటీ అధ్యక్షుడు అన్నవరపు రవి, ముండ్లమూరు రైతు సంఘ అధ్యక్షుడు బంకా నాగిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సూదిదేవర అంజయ్య, మండల బూత్ కమిటీ అధ్యక్షుడు భిక్షాల్‌రెడ్డి, సర్పంచ్ చొప్పరపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ముండ్లమూరు మండలం నూజిళ్లపల్లిలో..

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు తిరిగి అప్పగింత


బాధితులకు సెల్‌ఫోన్‌లు అందజేస్తున్న ఎస్‌ఐ

పుల్లలచెరువు: నూతన సాంకేతిక టెక్నాలజీని ఉపయోగించి బాధితులు పోగొట్టుకున్న ఫోన్లను తిరిగి అప్పగించినట్లు ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపారు. ఆయన శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ పర్యవేక్షణలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆధునిక సాంకేతికను ఉపయోగించి సెల్‌ఫోన్లను గుర్తించి ముటుకుల, నాయుడుపాలెం గ్రామాలకు చెందిన బాధితులకు అందజేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాధితులు ఎస్‌ఐ సంపత్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

తాళ్లూరులో భారీ వర్షం


పశుగ్రాసం కోసం వెళ్తున్న జీవాలు

తాళ్లూరు: మండంలో శనివారం భారీ వర్షం కురిసింది. కొన్ని రోజులుగా ఎండలు అధికంగా కాయడంతో ప్రజలు ఎండ తీవ్రతకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బోర్ల ద్వారా వరి, ప్రతి, మొక్కజొన్న సాగు చేసిన రైతులకు ఈ వర్షంతో నీటి తడి లభించినట్లయింది. రెండు రోజుల నుంచి మోస్తరు వర్షాలు కురవడంతో వాతావరణం చల్లగా ఉంది. ప్రజలు ఆనందంగా ఉన్నారు. పశువులు, జీవాలు మేపుకునే పాడి రైతులకు పశుగ్రాసం సంవృద్ధిగా దొరుకుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమయం లేక చెప్పలేదు..

- పునరావృతం కాకుండా చూసుకుంటాం

సాక్షి ఎఫెక్ట్..

దర్శి: సాక్షి దినపత్రిక దర్శి జోన్ పేజీలో ఈ నెల 12వ తేదీ శనివారం ముండ్లమూరులో ప్రొటోకాల్ ఉల్లంఘన అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి అక్కడి ఏఓ తిరుమలరావు స్పందించారు. సమయం తక్కువ ఉన్నందున అధికారిక కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీలను ఆహ్వానించలేకపోయానని స్పష్టం చేశారు. ఇక ముందు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటానని వివరణ ఇచ్చారు. ఇదిలా ఉండగా తిరుమలరావు రాత పూర్వకంగా ఇచ్చిన వివరణ ప్రకారం ఎంపీపీ, జెడ్పీటీసీలకు కలెక్టర్ వస్తుంటే సమాచారం ఇవ్వక పోవడానికి సమయభావం లేదని చెప్పారేగానీ కలెక్టర్‌తో పాటు ప్రొటోకాల్ ప్రకారం ఫ్లెక్సీలో ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఫొటో ప్రచురించకుండా ఆయనపై పోటీ చేసి ఓడిపోయిన టీడీపీ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి ఫొటో ప్రచురించడంపై మాత్రం సమాధానం చెప్పలేదు. నియోజకవర్గానికి కలెక్టర్ వస్తుంటే ఎమ్మెల్యే బూచేపల్లికి ఎందుకు చెప్పలేదో అధికారులే సమాధానం చెప్పాలి. దీనికి తోడు నాలుగు గంటల నుంచి 8 గంటల వరకు మీటింగులున్నాయని, రాత్రి 9 గంటల తర్వాత ప్రోగ్రాం ఖరారైందని మండలంలోని రైతులందరికీ చెప్పామని చెప్పారు. కానీ టీడీపీ మద్దతుదారులైన రైతులకు మాత్రమే సమాచారం ఇచ్చారు. సుదూర ప్రాంతం వెళ్లి టీడీపీ ఇన్‌చార్జి ఫ్లెక్సీలు వేయించి తీసుకు రావడం వంటి కార్యక్రమాలకు మాత్రం సమయం ఉండగా ఎంపీపీ, జెడ్పీటీసీలను సమావేశానికి పిలవడానికి కూడా సమయం లేదా అని ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఎక్కడా ప్రొటోకాల్ పాటించడం లేదని, తప్పించుకునేందుకు క్లారిటీ లేని ప్రకటనలు విడుదల చేస్తున్నారన్నారు.

బీసీ ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి

దర్శి: బీసీ ఉద్యోగులు ఐక్యంగా ఉండాలని కేవీజీ కీర్తి అన్నారు. దర్శి డివిజన్ బీసీ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం పట్టణంలోని హ్యాపీ హోమ్స్‌లో శనివారం జరిగింది. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గురుప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ఉద్యోగులు కబీర్, పరకాల వెంకటేశ్వర్లు, బాషా, గురుప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కీర్తి మాట్లాడుతూ సన్మాన గ్రహీతలు తమ వృత్తికి ఎనలేని సేవలందించి వారి సేవలు మరువలేనివని కొనియాడారు. సమాజానికి విలువైన వారని అభినందనలు తెలిపారు. ఉద్యోగులు ఐక్యంగా ముందుకు సాగాలని, ఎవరికి ఏ కష్టం వచ్చినా బీసీ ఉద్యోగుల సంఘం అండగా ఉంటుందన్నారు. ఈ


సన్మానం అందుకున్న ఉద్యోగులతో బీసీ సంఘ నాయకులు

నెల 22న జరిగే ఉద్యోగుల సమావేశానికి అన్ని విభాగాల్లోని ఉద్యోగులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో రాజశేఖర్, నజీర్లు, ఎ.ప్రసాద్, రంగారావు, నక్కా కోటేశ్వరరావు, వేణు, శ్రీను, పి.ఖాసిం, బాలసుబ్రహ్మణ్యం, శ్రీను, సురేష్, అంజయ్య, సుధాకర్, సుబ్బారావు,, పీరు సాహెబ్, ఏడుకొండలు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తిరుమలనాథ స్వామికి పూజలు


ప్రత్యేక అలంకారంలో తిరుమలనాథ స్వామి

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత గొంద్రాలికొండ తిరుమలనాథ స్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దేవాలయం అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం దగ్గర దంపతులు కుంకుమార్చన పూజలు చేశారు. సంతానం కలగాలని గిరికొండ చుట్టు దంపతులు ప్రదక్షిణలు చేశారు. మహిళలు పొంగళ్లు తయారు చేసి స్వామికి నైవేద్యం చెల్లించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కుబడులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.